క్లుప్తంగా

శాకంబరిగా గాయత్రి అమ్మవారు



శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న గాయత్రిమాత

గిద్దలూరు రూరల్: ఆషాఢ మాసం సందర్భంగా పట్టణంలోని కాశినాయన కుంటలో ఉన్న గాయత్రిమాత ఆలయంలో సోమవారం అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రకృతి స్వరూపమైన అమ్మవారిని కూరగాయాలతో అలంకరించడంలో దాగి ఉన్న విశిష్టతను అర్చకులు వివరించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కేజీబీవీలో బాలికలకు నేత్ర వైద్య పరీక్షలు



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

పొదిలి: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో సోమవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆప్తాల్మిక్ అసిస్టెంట్ ఎ.నరసింహారావు బాలికలకు నేత్ర పరీక్షలు చేశారు. ఏంఈఓ నాగలక్ష్మి మాట్లాడుతూ.. పోషకాలు కలిగిన సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండాలని బాలికలకు సూచించారు. కేజీబీవీ ప్రత్యేక అధికారిణి అనూరాధ, ఎంఎల్‌హెచ్‌పీ సుప్రజ, ఎంఏ శ్రీనివాసరెడ్డి, ఏఎన్‌ఎం కె.విజయ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు



సామూహిక సీమంతాలు చేస్తున్న మహిళా కమిటీ సభ్యులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని ఎన్‌ఎస్ నగర్‌లో ఉన్న భగవాన్ సత్యసాయిబాబా మందిరంలో మహిళా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం 20 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. మహిళలకు చీరలు, పసుపు కుంకుమ, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ ఇన్‌చార్జి జి.ప్రసన్నదేవి, సభ్యులు సువర్చల, రాజేశ్వరి, నాగలక్ష్మి, హృదయలక్ష్మి, వై.లక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అరుణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్టీ వర్గీకరణ చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘాల జేఏసీ నాయకులు

బేస్తవారిపేట: రాష్ట్రంలో 34 గిరిజన తెగలు ఉన్నాయని, ఎస్టీ వర్గీకకరణతో వెనుకబడిన తెగలకు న్యాయం జరుగుతుందని ఏపీ గిరిజన సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కావేటి లక్ష్మన్న, ఎగ్జిక్యూటివ్ మెంబర్ అన్నగాని సుధాకర్ పేర్కొన్నారు. ఎస్టీ వర్గీకరణ కోరుతూ సోమవారం బేస్తవారిపేట తహసీల్దార్ జితేంద్రకుమార్‌కు అర్జీ అందజేశారు. ఎస్టీ కులంలో ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుబడిన, నేటికీ దుర్భరమైన జీవనం సాగించే వారున్నారని, వర్గీకరణతో కులంలోని అందరికీ మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్టీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ శ్రేణుల సమావేశం

కొనకనమిట్ల/పొదిలి రూరల్: పొదిలి, కొనకనమిట్ల మండలాల వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశాలు, బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని పొదిలిలోని మంజునాథ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. పొదిలిలోని దర్శి రోడులో ఉన్న మంజునాథ కళ్యాణ మండపంలో మంగళవారం ఉదయం 10 గంటలకు పొదిలి అర్బన్, రూరల్ మండలాల పార్టీ శ్రేణుల సమావేశం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, నగర పంచాయతీ అధ్యక్షుడు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు కొనకనమిట్ల మండల స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు మోరా శంకర్‌రెడ్డి తెలిపారు. సమావేశాలకు ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశాలకు పార్టీ శ్రేణులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.



కందులాపురం పంచాయతీ పరిధిలో అధ్వానంగా ఉన్న రహదారి



కంభం అగ్నిమాపక కార్యాలయం సమీపంలో రోడ్డుపై నిలిచిన నీరు

చినుకు పడితే చిత్తడే!

- అధ్వానంగా అంతర్గత రహదారులు
- చిన్నపాటి వర్షానికే బురదమయం
- రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



హజరత్‌గూడెం పంచాయతీ పరిధిలో అంతర్గత రోడ్డు బురదమయం

కంభం: చిరు జల్లులకే అంతర్గత రహదారులు బురదమయంగా మారుతున్నాయి. ఓ మోస్తరు జల్లులు కురిస్తే వీధులన్నీ జలమయం అవుతున్నాయి. వర్షం వెలిసిన తర్వాత గడప దాటి బయట అడుగు వేయాలంటేనే ప్రజలు చీదరించుకుంటున్న పరిస్థితి. అంతర్గత రహదారులపై రాకపోకలు సవ్యంగా సాగేలా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నా పాలకులు పట్టించుకోకపోవడంతో తిప్పలు తప్పడం లేదు.

కంభం మండలంలోని పలు గ్రామాల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. మేజర్ పంచాయతీలైన కంభం, కందులాపురంతోపాటు హజరత్‌గూడెంలో రహదారుల పరిస్థితి దారుణంగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జనావాసాలు, గృహాలు ఉన్నచోట కంటే ప్రజలకు ఉపయోగపడని చోట, వారికి అనుకూలమైన నాయకులు ఉన్న ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించుకునేందుకే అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ప్రజలు అధిక సంఖ్యలో నివసించే ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాన్ని విస్మరించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో అంతర్గత రహదారులన్నీ బురదమయంగా మారిపోయి కనీసం నడిచేందుకు వీల్లేకుండా పోయింది, ద్విచక్రవాహనదారులు, ఆటోలు, ఇతర వాహనాలు బురదలో కూరుకుపోతుండటంతో అవస్థలు పడుతున్నారు. కంభం అర్బన్ కాలనీలో పలు చోట్ల రోడ్లు వేసిన నాయకులు ప్రధాన రహదారిని వదిలేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యానగర్ కాలనీ, కృపామృతస్కూల్ రహదారి, పార్కువీధిలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే రహదారి, గౌతమి స్కూల్ వెనుకవైపు రహదారులు, అధ్వానంగా తయారవడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సైతం అధికార పార్టీ నాయకులు చెప్పినచోటే రోడ్లు వేస్తుండటంతో సామాన్య ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజలకు అవసరమైన చోట సీసీరోడ్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కంభం అర్బన్ కాలనీలోకి వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి



కంభం పార్కు వీధిలో అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే రహదారి ఇలా..

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



గిద్దలూరులో మానవహారంగా ఏర్పడి నిరసన తెలియజేస్తున్న కార్మికులు



మార్కాపురంలో నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు కార్మికులు

గిద్దలూరు రూరల్: మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. నిరవధిక సమ్మెల్లో భాగంగా సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్, శానిటేషన్ కార్మికులు స్థానిక నగర పంచాయతీ కార్యాలయం నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు టి.ఆవులయ్య మాట్లాడుతూ.. కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం గత 6 రోజుల నుంచి సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. జీఓ 36 ప్రకారం వేతనం చెల్లించాలని, కేటగిరీ వారీగా కార్మికులందరికీ వేతనం చెల్లించాలని, రిటైరైన వారి పిల్లలకు ఉద్యోగం కల్పించాలని, వయో పరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని, గత సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘ నాయకులు మురళి, సంటయ్య, బాలయ్య, రంగయ్య, పుల్లయ్య, నాగయ్య, రంగస్వామి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్: మున్సిపల్ కార్యాలయాల్లో ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు సమస్యలను కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకేఎం రఫీ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కాంట్రాక్టు కార్మికులు నల్ల రిబ్బన్లు నోటికి కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ కార్మికులు చాలీచాలని వేతనంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. జీవో నంబర్ 36 అమలు చేయాలని, కార్మికులందరికీ రూ.21 వేల వేతనం అమలుచేయాలని కోరారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.75 వేలు ఇవ్వాలని, ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పందించకుంటే సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సుబ్బరాయుడు, హరి, నాయకులు కృష్ణ, చెన్నయ్య, శేఖర్, రషీద్ బాషా, యూసఫ్, గురునాథం, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.



పెద్ద మసీదు వద్ద నేలకొరిగిన వేపచెట్టు

పొదిలిలో భారీ వర్షం

పొదిలి: పొదిలిలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారి సహా పలు రోడ్లు జలమయమయ్యాయి. పెద్ద మసీదు వద్ద ఉన్న భారీ వేప చెట్టు సోమవారం నేలకొరిగింది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. చెట్టు కింద ఉన్న మూడు తోపుడు రిక్షాలు ధ్వంసమయ్యాయి. ఆంజనేయస్వామి గుడి రోడ్డు, నేతపాలెం, టైలర్స్ కాలనీ, నిర్మలా కాన్వెంట్ రోడ్డులో జలమయం కావడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.



జలమయమైన ఆంజనేయస్వామి గుడి

ఘనంగా కొడు పీర్ల పండగ

కొమరోలు: మండలంలోని సూరవారిపల్లి గ్రామంలో కొడు పీర్ల పండగను గత రెండు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు ఉత్కంఠగా సాగాయి. ఎడ్ల పోటీలను వైఎస్సార్ సీపీ నాయకుడు కామూరి రమణారెడ్డి ప్రారంభించారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.80 వేలను రమణారెడ్డి అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పాఠశాలకు ఆడియో సిస్టమ్ వితరణ

కంభం: మండలంలోని హజరత్‌గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సోమవారం రిటైర్డ్ డీవైఈఓ కొప్పుల వెంకట్రావు మూవబుల్ ఆడియో సిస్టమ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ షబ్బీర్ మాట్లాడుతూ.. పాఠశాలకు దాతల సహకారం అభినందనీయమన్నారు. స్టోర్ రూము ఏర్పాటుకు సహకరించిన వల్లంశెట్టి వెంకటేశ్వర్లు, ఆఫీస్ టేబుల్ అందజేసిన రిటైర్డ్ రైల్వే ఎస్సై గుర్రం శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రిటైర్డ్ డీవైఈఓను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బారావు, సరోజ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఆడియో సిస్టమ్ అందిస్తున్న దాత వెంకట్రావు

వైఎస్సార్‌కు ఘన నివాళి



వైఎస్సార్ విగ్రహానికి గజమాల వేస్తున్న వైఎస్సార్ సీపీ నాయికులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాచర్ల గేటు సెంటర్‌లో గల వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగం కార్యదర్శి వేమిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు సోమవారం గజమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశానికి ముందుగా వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్న విశా సుబ్బరత్నం కల్యాణ మండపానికి ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో పార్టీ గిద్దలూరు మున్సిపల్ విభాగం అధ్యక్షుడు మానం బాలిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు చేరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, పాలుగుళ్ల సుబ్బారెడ్డి , కాతా నరసింహారెడ్డి, నాసరి శ్రీను, పాలుగుళ్ల నరసింహారెడ్డి, మత్తయ్య, దిలీప్‌రెడ్డి, మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై వినతుల వెల్లువ



అర్జీలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డివిజన్‌లోని వివిధ గ్రామాల ప్రజలు మార్కాపురంలో సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు అర్జీలు అందజేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు అత్యధికంగా భూ సమస్యలపై అర్జీలు అందాయి. మండలంలోని కోలభీమునిపాడు గ్రామానికి చెందిన ఎం.వెంకటేశ్వరనాయక్ తన పొలానికి హద్దులు చూపాలని అర్జీ ఇచ్చారు. కంభం మండలం సైదాపురం గ్రామానికి చెందిన ఎ.స్వప్న తన భూమి ఇతరుల పేరుపై ఆన్‌లైన్ చేశారని, రికార్డులు పరిశీలించి అనర్హుల పేరు తొలగించాలని విన్నవించారు. బేస్తవారపేట మండలం చెట్టిచర్ల గ్రామానికి చెందిన చింతం వెలుగొండయ్య తన స్వాధీనంలో ఉన్న భూమిని పరిశీలించి ఆన్‌లైన్ చేయాలని అర్జీ ఇచ్చారు. బేస్తవారపేట గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి కంభం మండలం ఎల్‌కోట రెవెన్యూ ఇలాకాలో తనకు భూమి ఉందని అయితే పట్టాదారు పాసుపుస్తకంలో తప్పుగా నమోదుచేశారని, రికార్డులు పరిశీలించి, నూతన పట్టాదారు పాసుపుస్తకం ఇప్పించాలని కోరారు. పుల్లలచెరువు మండలం రాచకొండ పంచాయితీ వెంకటరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శివమ్మ తన పొలాన్ని ఇతరులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తర్లుపాడు మండలం నాగెళ్లముడుపు గ్రామానికి చెందిన మేరమ్మ వారసత్వంగా వచ్చిన పొలాన్ని తన పేరుపై మార్చాలని అర్జీ ఇచ్చారు.

సమస్యలు పరిష్కరించాలి

మార్కాపురం: తమ గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని మార్కాపురం మండలం పెద్దనాగులవరం వాసులు సీపీఎం మండల కార్యదర్శి గుమ్మా బాలనాగయ్య, వ్యవసాయకార్మిక సంఘం తురకా ఏడుకొండలు ఆధ్వర్యంలో ఎంపీడీఓ శ్రీనివాసులుకు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. పెద్దనాగులవరం నుంచి శ్మశానం మీదుగా ఆటోనగర్ వరకు రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఉపాధి హమీ పథకం కూలీలకు 9 వారాల నుంచి వేతనం ఇవ్వడం లేదని, కూలి సొమ్ము వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరించేందుకు సాగర్ నీరు సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు అడివయ్య, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ భర్త మృతికి ‘అన్నా’ సంతాపం



సాల్మన్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న అన్నా రాంబాబు

మార్కాపురం: వైఎస్సార్ సీపీ నాయకురాలు, మార్కాపురం ఐదో వార్డు మాజీ కౌన్సిలర్ సుష్మితా భూషణకుమారి భర్త సాల్మన్(60) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు సోమవారం ఉదయం సాల్మన్ మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట కౌన్సిలర్ చాటకొండ చంద్ర, రోజ్ లిడియా, జి.శ్రీనివాసరెడ్డి, గుంటక చెన్నారెడ్డి, చాతరాజుపల్లి శ్రీను, ఉత్తమ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పే



గొట్లగట్టులో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

కొనకనమిట్ల: ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, ఈ నేపథ్యంలో పేపర్, జ్యూట్ బ్యాగ్‌లు వినియోగించాల్సిన అవసరం ఉందని మండలంలోని గొట్లగట్టులో జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం ఆదినారాయణ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ భూమిలో కలవడానికి ఏళ్ల సమయం పడుతుందని, భూగర్భ జలాలు క్షీణించే ప్రమాదం కూడా ఉందన్నారు. అనంతరం ప్లాస్టిక్ వినియోగించబోమని ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌ను రద్దు చేయాలి



సీడీపీఓకు వినతి పత్రాన్ని అందజేస్తున్న కార్యకర్తలు

గిద్దలూరు రూరల్: ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. అనంతం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీడీపీఓ జ్యోతికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం నాయకురాలు పి.స్వర్ణకుమారి, మున్నా మాట్లాడుతూ.. ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌తో అంగన్‌వాడీ కార్యకర్తలపై పనిభారం పెరిగిందన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల ఫొటోలు తీసి అప్‌లోడ్ చేసే సమయంలో సర్వర్ పనిచేయకపోవడంతోపాటు ఓటీపీలు రాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. దీంతో లబ్ధిదారులు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల యూనియన్ సభ్యులు రమణమ్మ, రత్నం, సారమ్మ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీకి డ్రోన్ కెమెరా అందజేత



ఎస్పీ దామోదర్‌కు డ్రోన్ అందజేస్తున్న దాతలు

ఒంగోలు సిటీ: జిల్లా పోలీసు శాఖకు పొదిలి మండలం కాటూరివారిపాలెం గ్రామానికి చెందిన మాకినేని వెంకట రమణయ్య, దంటు నరసింహారావు సోమవారం అత్యాధునిక సాంకేతికతతో కూడిన డీజేఐ ఎయిర్‌3ఎస్ డ్రోన్ కెమెరా అందజేశారు. ఎస్పీ ఏ.ఆర్.దామోదర్‌కు జిల్లా పోలీస్ కార్యాలయంలో దానిని అందించారు. దానికి పొదిలి పోలీస్ స్టేషన్‌కు కేటాయిస్తూ పొదిలి ఎస్సై వేమనకు ఎస్పీ దామోదర్ అందజేశారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా, ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణకు, వీఐపీ బందోబస్తు నిర్వహణలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు, అలాగే సుదూర ప్రాంతాల్లో ఉన్న అనుమానితుల కదలికలపై నిఘా పెట్టేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నామని ఎస్పీ తెలిపారు. నేరాల కట్టడిలో డ్రోన్లు పోలీసులకు డేగ కన్నులా ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, పొదిలి సీఐ వెంకటేశ్వర్లు, పొదిలి ఎస్సై వేమన, సిబ్బంది పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

మార్కాపురం: మార్కాపురం డిపో నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 22వ తేదీన మార్కాపురం డిపో నుంచి కాణిపాకం, తిరుత్తణి, కంచి, శ్రీరంగం, మధురై, కన్యాకుమారి, రామేశ్వరం, అరుణాచలం పుణ్యక్షేత్రాలకు సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. టికెట్ ధర రూ.7500గా నిర్ణయించామని, భక్తులు, పర్యాటకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.